# ఇంతే సంగతులు

"అయ్యా సినబాబూ! దండాలు సామీ! నా పేరు ఈరయ్య. నువ్వు నన్ను మరిసినావేమో! మీ నాయనకు నేనంటే పేణం. నువ్వింతోడివిగా ఉండేటప్పుడు నేను మీ యింటికాడ గొడ్ల మేపతా వుంటి, అప్పుడు మీ అవ్వ వుండె! సచ్చి సొర్గానవుంది పున్నాత్మురాలు, కడుపుజూచి అన్నం పెట్టేది. ముప్పయిమంది మనుషులు కలుపు దీస్తావుంటే పెదబాన సంగటి కెలికి కుక్కి తట్టలో తలకెత్తుకొని మడికాడి కొచ్చేది. పండగొచ్చిందంటే ముద్ద తినేవాడు రెండు ముద్దలు తినాల! ఆయమ్మ అస్తవాసి అటుమంటిది!

మనిషి మంచీ సెడ్డా సచ్చేటప్పుడు చూడాలంటారు బంగారు తల్లి. మాటాడతా మాటాడతా కన్నుమూసింది. మీ నాయన మాత్తరం? ఆయనా, ఆ తల్లికి తగినకొడుకే మాటిస్తే తప్పడు! మనసిస్తే యిడవడు బుద్ధిలో దరమ రాజు! చేతికెముక లేకపోయ! ఇంతలో ఆ అయ్య కట్టె కడతేరిపోయ! ఆయన పొయ్యేనాటికి నువు లేదర బిడ్డవై పోతివి.

నేనూ మీ యింటో కొలువు మానుకుంటి 'ఎంత కాలమని ఒంటి కట్టెగా ఉండిపోతావురా! గంతకు తగిన బొంతగా జూచి ఒకింటోడివి కారా! అని మా వాళ్ళంతా సతపోరిరి. వాళ్లమాట యినకపోయినా బాగుండె, యింటి ఒకాదదాన్ని కట్టుకుంటి. నాకున్నూ ముగ్గురు బిడ్డలు కలిగిరి. వాళ్లను సాకి సంతరించేదానికి నేనెన్ని పాట్లు పడి నానో ఆ బగుమంతుడికే ఎరిక! కొండెక్కి బోదగోస్తి, అడివికి బోయి కట్టెలు గొడ్తి, సంతకు బండి తోల్తి, బాయిలో మట్టి మోస్తి, ఇల్లు గట్టేసోట ఇటికలందిస్తి సేతి నిండుకూ పనుంటే ఎంత పనైనా సెయ్యొచ్చు పన్లేకపోతే ఏం జెయ్యాల?

మనిషికి పని దొరకాలంటే సేద్యాలు జరగాల, సేద్యాలు జరగాలంటే నీళ్ళుండాల. సెట్టు సేమలు సిగురెత్తాలంటే కొండకోనలు పచ్చగిల్లాలంటే కాపరాలు చల్లంగా

వుండాలంటే, దేశం నిమ్మళంగా వుండాలంటే వాగుల్లో వంకల్లో బాయిల్లో సెరువుల్లో సలిచెలమల్లో నీళ్ళుండాల, మనిషి కయితే పూటకు రెండుసార్లయినా చెంబుడు చెంబుడు నీళ్ళుండాల, గొడ్డు కయితే రోజుకు రెండుసార్లయినా కడివెడు కడివెడు నీళ్ళుండాల. ఆ లెక్కన బూమి తల్లికిన్ని నీళ్ళుండాల? వానసినుకు కింద రాలకనెపోతే ఆ తల్లి బతుకేం కావాల? ఆ తల్లిని నమ్ముకున్న మనిషి బతుకేం కావాల?

అదంతా యిప్పుడెందుకులే! అసలు యిషయం గాలికొదిలి నేను పాత సంగతులన్నీ తవ్వుకుంటావుండా. ఏం లేదు సామీ నువునా పెద్ద కొడుక్కొక జాబు రాసి పెట్టు. అందుకని ముప్పావలా యిచ్చి పోస్టు ఆపీసులో ఈ కాగితం కొనుక్కొచ్చినా ఏం రాయాల్సిందీ నేంచెప్తానే! నువు మొదలుపెట్టు 'ఒరే పెదబ్బా! నువు నీ పెళ్ళాం బిడ్డలతో ఇల్లొదిలి పోయి ఆరు నెల్లాయ. ఇంత కాలంగా అతీగతీ తెలవకుండా పోతివి, కాల్దీసి బయట పెట్టే నాటికి నీ పెళ్ళాం కడుపుతో వుంది ఆ పిల్ల తీర్థమాడిందో లేదో తెలియకపోయ మగబిడ్డో ఆడబిడ్డో తెలియకపాయ ఇక్కడ మేమిద్దరం ముసిలోళ్ళం, గుడిసెలో అఘోరిస్తా వుండామని నీకు బొత్తిగా గుర్తుండకపోయ, నీకంటే నాలుగాకు లెగ చదివినోడే నీ తమ్ముడు గూడా! మిలిటరీలో చేరతానని వెళ్ళినోడు, వాడు మిలిటరీలో చేరినాడో, చిత్తూరులో మూటలే మోస్తావుండాడో తెలియకపోయ.

మీ అక్కా బావా రంగంపేటలో గనక వుందుంటే నెలకొక సారైనా వచ్చి మమ్మల్ని చూచిపోతా వుందురు. కూలీలు దొరక్క జరుగుబాటు కుదరక వాళ్ళు కూడా బిడ్డల్ని చంకనేసుకొని వుత్తరాది వెళ్ళిపొయ్యిరి. మాకామాత్రం దిక్కుగూడా కరువైపాయ, ఇక్కడ పరిస్తితి జూడబోతే నానాటికీ దిగజారతావుంది. తెల్లారిందంటే భయం. ఎండ ముకం జూడకుండా ఇంట్లో కూసుంటేనే బతికినాము, మధ్యాన్నమయ్యేటప్పటికి కాకులు గూడా బయట కనపడవు.

ఒక్క బోరింగు బాయిలో తప్పితే నీళ్ళు లేవు, వరిమళ్ళు ఆశ ఎప్పుడో వదులుకొన్ని. తడిసాలక చెరుకు దోటలుగూడా వాడిపోయ, గరిక పోసయినా నోటికి దొరక్క గొడ్డుగోదలన్నీ ఎముకల గూళ్ళయి పోయ. రైతులు దిగులుతో చిక్కి సగమైపోయిరి– మన అరిజనవాడలో నాలుగయిదు కుటుంబరాలు దప్పితే మిగిలినోళ్ళందరూ పొట్ట సేత బట్టుకొని దేశాల పాలయిపోయిరి. నువు పోతా పోతా మిగిలించిన నాలుగు మేకల్లో ఆఖరి మేకను నెల రోజుల నాడు అమ్ముకుంటి, ఒళ్ళు జబ్బు చేసి మీ అమ్మ మంచందిగి

యిరవై రోజులాయ. ఆసుపత్రి నించి మాత్తర్లు తెచ్చిచ్చినా గుణం కనిపించలా, 'బిడ్డల్ని జూడాల, బిడ్డల్ని జూడాల' అంటూ రెయ్యింబవుళ్ళూ ఒకటే ఆరాటం! మనూర్లో కరణంగారి బామ్మర్ది లేడూ ఎంకట నర్సయ్య, ఆయన బస్సులో వస్తావుంటే నువు కనిపించినావంట. ఆయన చెప్పంగా నువ్వెక్కడుండావో తెలిసింది. ఒరే నాయనా మీరేమో రెక్కలొచ్చిన పచ్చులయి పోతిరి'. తలా ఒక మూలకు ఎగిరిపోతిరి. మాకేం మీ పెట్టు పోత లక్కర్లేదు. ఒక సారొచ్చి నువు మీ అమ్మను చూచిపోతే చాలు. అదే పదేలుబతికనంత కాలం బతకదు. ఈ జాబును తంతిగా యెంచి ఇదందగానే బయల్దేరి రావాల.

ఇంతే సంగతులు....

అంతేలే సామీ! ఇంక అడ్రస్సు రాయి

'పీలేరు టేషనుకు మూడో మైల్లో బాటపని జేసే చెంగల్రాయుడు' అని రాయి ఆ మాత్తరం సాలకపోతే కుడికాలు కొంచెం ఎగరేస్తా నడస్తాడని గూడా రాయి, రాసినావు గదా. చాల్లే సేరుతుందిలే. సేర కెక్కడికి పోతుంది?

దండాలు సామీ వెళ్ళొస్తా.

(...ఆదర్శిని 27.01.1993)

❀ ❀ ❀